క్లుప్తంగా

విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన



విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న రీసోర్స్ పర్సన్ అరుణ

దాబాగార్డెన్స్ : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పించారు. రీసోర్స్ పర్సన్ అరుణ విద్యార్థులకు కంప్యూటర్‌పై టైపింగ్ నేర్పించారు. అనంతరం విద్యార్థులు ఆటలు, పాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం పుస్తకాలు చదివారు. విద్యార్థులకు శీతల పానీయాలు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎల్ఆర్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మెలోడీ క్రియేటర్స్ వార్షికోత్సవం



సినీ సంగీత విభావరిలో పాల్గొన్న గాయనీ గాయకులు, అతిథులు

దాబాగార్డెన్స్ : మెలోడి క్రియేటర్స్ 24వ వార్షికోత్సవం ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జీఎస్ఎన్ రాజు, ప్రముఖ సంఘ సేవకుడు వంకాయల సన్యాసిరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 23 ఏళ్లుగా సినీ సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తూ విశాఖ వాసుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సాంస్కృతిక సంస్థ మెలోడీ క్రియేటర్స్ అన్నారు. ప్రేక్షకుల ఆదరణ పొందే దిశగా ఎన్నో సంగీత కార్యక్రమాలు న్విహించిన నిర్వాహకులను అభినందించారు. నటుడిగా ఎన్‌టీఆర్, గాయకుడిగా బాలసుబ్రహ్మణ్యం తెలుగు చలన చిత్ర పరిశ్రమకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పి. వెంకట్రావు, రమేష్‌చంద్ జైన్, కొణతాల రాజు, ఉషా చీరాల, ఎం. మస్తాన్‌రెడ్డి, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎంవీ రాజశేఖర్, ప్రోగ్రామ్ కన్వీనర్ కె. వీరాస్వామి, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం కోసం పూజలు



ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొడుతున్న నాయకులు

మల్కాపురం: పేదల గుండెల్లో గుడి కట్టుకున్న వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరి కాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా జింక్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ గంట్యాడ కృష్ణమూర్తి మాట్లాడుతూ వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. నిరుపేదల ఇళ్లలో వెలుగులు నింపి వారి ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కించిన మహానుభావుడు జగన్ అని కొనియాడారు. పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ తక్కువ సమయంలో రూ. 220 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేసి చూపించారన్నారు. అలాంటి నాయకుడు వెంట పశ్చిమ ప్రజలు నిలిచారని, ఆయన భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



నీట మునిగిన హార్బర్ పోలీస్‌స్టేషన్ రహదారి



రామకృష్ణా జంక్షన్‌లోని మసీదు వద్ద వర్షం నీటిలోనే వాహనాలు



వర్షం నీట మునిగిన పూర్ణామార్కెట్ రహదారి

వర్షం.. హర్షం

- ఉరుములు.. మెరుపులతో కురిసిన వాన
- సేదదీరిన ప్రజలు
- వన్‌టౌన్‌లో నీట మునిగిన పలు ప్రాంతాలు



చెరువులా మారిన వన్‌టౌన్ రహదారిలోనే ప్రజల రాకపోకలు



వర్షం నీట.. వెలంపేట

జగదాంబ : ఈ వేసవిలో ఎండలు నిప్పుల కొలిమిని తలపించాయి. చిన్నాపెద్దా అంతా ఈ వేడికి అల్లాడిపోయారు. మరీ ముఖ్యంగా రోహిణికార్తె ప్రారంభం నుంచి ఎండలు ఠారెత్తించాయి. జనం బయటికి రావటానికి సాహసించలేదు. రోజులు ఎలా గడుస్తాయిరా భగవంతుడా అని పెద్ద వయసు వారు ఆందోళనకు గురయ్యారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వెళ్లాల్సిన వారు గొడుగులు, టోపీలు ధరించేవారు. బయట తిరిగే వారు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలను ఆశ్రయించేవారు. ఈ తరుణంలో శుక్రవారం అర్ధరాత్రి.. ఆదివారం ఉదయం కురిసిన వర్షంతో వాతావరణం కాస్త చల్లబడి అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది.



జలమయమైన రామకృష్ణా జంక్షన్

రహదారులు జలమయం..

ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి పాతనగరంలో రహదారులు నీట మునిగాయి. పోర్టు దరి హార్బర్ స్టేషన్ రహదారి వర్షం నీటితో నిండిపోయింది. రామకృష్ణా జంక్షన్, 75 ఫీట్‌రోడ్డు, జనతా బజార్ రహదారి, బౌదారా రోడ్డు, పూర్ణామార్కెట్, వెలంపేట ఇలా అన్ని రహదారులు మోకాళ్ల లోతు నీటితో నిండిపోయాయి. వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. పలు చోట్ల వాహనాలు నీటిలోనే ఉండిపోయాయి.



చెరువును తలపిస్తున్న బౌదారా రోడ్డు

రాత్రి కూడా దంచి కొట్టిన వర్షం



దొండపర్తి ఎరుకుమాంబ ఆలయం రహదారిలో వర్షంలో ప్రయాణిస్తున్న వాహనాలు

సీతమ్మధార : ఎండలతో అల్లాడిన ప్రజలకు ఆదివారం ఉదయం, రాత్రి కురిసిన వర్షం ఉపశమనం కలిగించింది. ఆదివారం ఉదయం ఏడున్నర నుంచి దాదాపు అరగంట పాటు కురిసిన వర్షానికి డైమండ్ పార్కు, న్యూకాలనీ, అల్లిపురం, దొండపర్తి తదితర ప్రాంతాల రోడ్లపై వర్షం పారాడింది. కాగా రాత్రి పది గంటల సమయంలో మరోసారి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షంలోనే వాహనాలు రాకపోకలు సాగించాయి. వర్షం భారీగా కురవటంతో చాలా ప్రాంతాల్లో ఎక్కడి వారు అక్కడే ఉండిపోయారు. ఉదయం, రాత్రి కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు సేదదీరారు.



వర్షంలో తడవకుండా దాలిరాజు మార్కెట్ సమీపంలోని పెట్రోల్ బంక్‌లో వేచి చూస్తున్న వాహన చోదకులు

అల్లర్లు చేస్తే కఠిన చర్యలు



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏఎస్ఐ రాజు

సీతమ్మధార: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ధర్మేంద్ర మాట్లాడుతూ కౌంటింగ్ రోజున ప్రత్యేక నిఘా ఉంటుందని, రౌడీషీటర్లు హద్దు మీరకుండా ఉండాలని సూచించారు. మద్యం షాపుల వద్ద గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఏఎస్ఐ రాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి పోకుండా ఉండాలన్నారు.

జర్నలిస్ట్ దుర్గారావు సేవలు చిరస్మరణీయం

సీతంపేట: జర్నలిస్ట్ సంఘాల నాయకుడిగా, సీనియర్ పాత్రికేయుడిగా సోడిశెట్టి దుర్గారావు అందించిన సేవలు చిరస్మరణీయమని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం మైదానంలో ఆదివారం దుర్గారావు రెండో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. శ్రీధర్‌తోపాటు పలువురు జర్నలిస్టులు దుర్గారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గారావు జర్నలిస్ట్‌గా అందరి మనసుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ దుర్గారావు మరణించి రెండేళ్లు కావస్తున్నా.. నేటికీ అందరి మనసుల్లో నిలిచి ఉన్నారన్నారు. అనంతరం లెన్స్ హన్స్ సంస్థ సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటి డ్రాప్స్, ఉచితంగా మందులు, 50 శాతం రాయితీతో కళ్లద్దాలు అందజేశారు. వర్షం కారణంగా క్రికెట్ మ్యాచ్ వాయిదా వేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు వాల్మీకి నాగరాజు, లోకేష్‌కుమార్, గుండురాజు, దుర్గారావు కుమారులు నిఖిల్, లోహిత్ పాల్గొన్నారు.



దుర్గారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జియ్యాని శ్రీధర్, గంట్ల శ్రీనుబాబు తదితరులు

అమర వీరుల త్యాగ ఫలితమే తెలంగాణ



వేడుకలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ వీరేశం, అతిథులు

ఉక్కునగరం: అమర వీరుల త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎస్.వీరేశం అన్నారు. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కు అధికారుల సంఘం (సి) భవన్‌లో ఆదివారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ప్రాణ త్యాగం చేశారని చెప్పారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎస్.కుమారస్వామి, ప్రధానకార్యదర్శి జి.ఆనంద్, అధికారులు వేణుగోపాల్, బి.బాలాజి, చంద్రమౌళి, ఆర్.నరసింహ, జి.మల్లేశం, అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.బాలరామ్, ఎన్.నర్సింగరావు, సీహెచ్. రవికుమార్ పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని ఎంవీపీ కాలనీకి చెందిన నండూరి రామకృష్ణ స్వామి అనే దాత రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

ఆదివారం స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయన సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు అందించారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పునఃప్రారంభం



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పునఃప్రారంభిస్తున్న పోచారెడ్డి రాకేష్‌రెడ్డి

దాబాగార్డెన్స్ : అధునాతనంగా పునర్నిర్మించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు వజ్జిపర్తి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి పోచారెడ్డి రాకేష్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వజ్జిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆధునిక హంగులతో పునర్నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు వేగి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి గుత్తుల శ్రీనివాసరావు, సోడదాసు సుధాకర్, కస్తూరి వెంకట్రావు, పిరిడి భగత్, గవర వెంకటరమణ, నాగఫణి, పి. పరమేశ్వరరావు, డోలా శ్రీనివాసరావు, విజయనగరం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రతినిధి రమేష్ పాల్గొన్నారు.

దైవ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం

దాబాగార్డెన్స్ : దైవ నామ సంకీర్తనతో ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తెలిపారు. నగరంలో గల కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆదివారం నామ సంకీర్తన, భక్తి గీతాలాపన, ఆధ్యాత్మిక ఉత్సవం నిర్వహించారు. ముందుగా మందిరంలో వేంచేసిన కుసుమ హరనాథ దివ్య మంగళ మూర్తులను అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం కె. నాగేశ్వరరావు, ఎంవీ రాజశేఖర్, కోల్‌కతా ప్రసాద్ భక్తి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ భూమిపై నివశిస్తున్న జీవునికి నామ సంకీర్తనతోనే ఆధ్యాత్మిక చైతన్యం కలుగుతుందన్నారు. భగవన్నామ సంకీర్తనలు చేస్తూ మానవ జన్మను సార్థకం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ సంయుక్త కార్యదర్శి కె. మంగరాజు, శివ, సీతారాం, భక్తులు పాల్గొన్నారు.



గీతాలు ఆలపిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు

జిమ్‌లో చిన్నారుల ఆటలు



తెన్నేటి పార్కులో ఆటలతో సందడి చేస్తున్న చిన్నారులు

ఆరిలోవ: పర్యాటక ప్రాంతం తెన్నేటి పార్కులో వీఎంఆర్‌డీఏ అధికారులు పిల్లల కోసం ప్రత్యేకంగా ఇటీవల జిమ్ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అధికారులు నగరంలో పార్కులు, ఖాళీ స్థలాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ జిమ్‌లు పెద్దలకు వీలుగా ఉన్నాయి. వీఎంఆర్‌డీఏ మాత్రం ఇక్కడ పిల్లల సౌకర్యార్థం జిమ్ పరికరాలు అందుబాటులో ఉంచింది. తెన్నేటి పార్కు సందర్శనకు వెళ్తున్న చిన్నారులు ఈ జిమ్ పరికరాల వద్ద సాధన చూస్తూ సందడి చేస్తున్నారు. పిల్లల తమ ఎత్తును బట్టి వారికి అనుకూలంగా ఉండే పరికరాలను వినియోగించుకుంటున్నారు.

నవ్వులు పంచిన వినోదాల విందు

సీతంపేట: ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రదర్శించిన కామెడీ స్కిట్లు నవ్వులు పంచాయి. క్లబ్ వ్యవస్థాపకుడు ఎం.వి.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కళాకారులు స్కిట్లు ప్రదర్శించారు. సినిమా షూటింగ్, దోమ తెర, ఎస్ఐ గారికి ఫోన్, మినిస్టర్ మర్యాద, నెక్లెస్, ఇంద్రధనస్సు చీర, పేపర్ బాయ్, జాతకాలు, వాడితో మాట్లాడకు స్కిట్లు కడుపుబ్బా నవ్వించాయి. జబర్దస్త్ ప్రకాష్, డేవిడ్ రాజు, కుమారి, భాను ప్రకాష్, శివజ్యోతి, ఇమంది ఈశ్వరరావు, నాయుడు, పోర్టు శేషు, మల్లిక, నాగగణేష్ అద్భుత హాస్యం, హావభావాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ముందుగా నాట్య గురువు ఎస్.శైలజ శిష్య బృందం అక్షిత, నికేతని, ఐశ్వర్య, మంజుల చేసిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అతిథులు దాడి సత్యనారాయణ, నండూరి రామకృష్ణ, తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, సూర్య, పూర్ణచంద్రరావు కళాకారులను సత్కరించి అభినందించారు.

రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి డ్రెయిన్ నుంచి మురుగు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో స్థానికులు అవస్థల పాలయ్యారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైనుంచి చెత్తాచెదారం పల్లపు ప్రాంతానికి కొట్టుకొచ్చి డ్రెయిన్లలో మేటలు వేయడంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ముగిసిన వేసవి నృత్య శిక్షణ శిబిరం



నృత్యం నేర్చుకున్న చిన్నారులతో నిర్వాహకులు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ రెవెన్యూ పార్కులో నెల రోజుల పాటు జరిగిన వేసవి నృత్య శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో అకాడమీ నృత్యకారులు సుమారు 100 మంది చిన్నారులకు శిక్షణ ఇచ్చారు. ముగింపు సందర్భంగా చిన్నారులు తమ నృత్య ప్రదర్శనతో తల్లిదండ్రులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు, అకాడమీ నిర్వాహకులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM

E.P.No. 505/2017 in AC No: 354/2014

Between:
M/s Shriram City Union Finance Ltd, Dwarakanagar Branch, Visakhapatnam ..DHR
And
Mr. Darla Appala Ranga Brahmaji Rao & others ..JDR's
To:
JDR 1 : Mr. Darla Appala Ranga Brahmaji Rao, S/o D. Samba Siva Rao, D.No.22-43-11/A, Kancharaveedhi, Visakhapatnam.

వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని పై నంబరు అవార్డు అమలులో సొమ్ము రాబట్టు నిమిత్తము పైన ఉదహరించిన న్యాయస్థానములో తేది: 18-06-2024వ తేది ఉ॥ 10-30 ని॥ల నుండి సా॥ 5-00 గం॥ల మధ్యకాలములో బహిరంగముగా వేలం వేయబడును. కావున కావలసినవారు ఆ సమయములో వేలములో పాల్గొనవచ్చునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

JDR1 No.1 SCHEDULE OF IMMOVABLE PROPERTY

Visakhapatnam District, Visakhapatnam Sub- District Greater Visakhapatnam Municipal Corporation, Sri Seetharama Swamy Temple ward, TS No. 494, Block No.7, Kancharaveedhi, an extent of 83 Sq. Yards or 69.398 Sq. Meters site together with RCC slabbed house consisting of ground floor with plinth area of 418.28 SFT and 1st Floor plinth area 418.28 SFT bearing D.No. 22-43-11, assessment No. 4086 bounded by:

East : Dhaba house of E. Ponnamma, **South :** Municipal Road, **West :** Property of Aripaka Rajeswari, **North :** Property of Kasarapu Subbarao.

Measurements:

East wing : 31.00 Feet or 9.45 Meters, **South wing:** 24.9 Feet or 7.34 Meters, **West wing:** 31.00 Feet or 9.34 Meters, **North wing:** 24.9 Feet or 7.34 Meters.

DHR Value: 35,00,000/- Hearing Date: 18-06-2024
Amin Value: 42,00,000/- Further Date: 25-06-2024

KODURI SREENIVASA RAO
ADVOCATE
S-2, BHARAT APARTMENTS,
Seethammadhara, Visakhapatnam.
Cell: 99084 95858, 86865 06068

తెన్నేటి పార్కుకు మహర్దశ

- ఆధునీకీకరణ పనులతో కొత్త శోభ
- మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం తెన్నేటి పార్కుకు మహర్దశ పట్టింది. శిథిలావస్థలో ఉన్న పార్కు రూపురేఖలు ఆధునికీకరణ పనులతో మారుతున్నాయి. కైలాసగిరి దిగువన బీచ్ రోడ్డును ఆనుకుని తెన్నేటి పార్కు సందర్శకులకు అందుబాటులో ఉంది. కైలాసగిరికి వెళ్లే సందర్శకులు ఈ పార్కుకు కూడా వెళ్తుంటారు. తీరం చెంతన పార్కు ఉండడంతో ప్రజలు ఎక్కువ సమయం గడుపుతుంటారు. ప్రస్తుతం పార్కు శిథిలావస్థకు చేరింది. రెయిలింగ్, ఫుట్‌పాత్‌లు పాడైపోయాయి. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు పార్కు ఆధునికీకరణపై దృష్టి సారించారు. దీంతో రూపురేఖలు మారుతున్నాయి. సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దుతున్నారు. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నారు. సందర్శకుల సౌకర్యార్థం ఫుట్‌పాత్‌లు నిర్మిస్తున్నారు. శుద్ధి చేసిన తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. పార్కులో పచ్చదనం కోసం లేన్‌లు అమర్చుతున్నారు. రెయిలింగ్ ఏర్పాటు చేసి రంగులు వేస్తున్నారు. సందర్శకులు కూర్చోవడానికి వీలుగా సిమెంట్ దిమ్మలు, సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. వాటిపై కూర్చుని సందర్శకులు సముద్రం అలలను తిలకించవచ్చు. ప్రధాన ముఖ ద్వారానికి మెరుగులు దిద్ది కొత్తదనం తీసుకువచ్చారు. కొద్ది రోజుల కిందట చేపట్టిన ఈ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. మరికొద్ది రోజుల్లో ఆధునికీకరణ పనులు పూర్తి చేసుకుని ప్రజలకు కొత్త అనుభూతిని పంచేందుకు సిద్ధమవుతోంది.



పార్కులో ఏర్పాటు చేస్తున్న సిమెంట్ బెంచీలు, రెయిలింగ్



రంగులు వేసిన తెన్నేటి పార్కు ముఖ ద్వారం